క్లుప్తంగా

నేడు సమావేశం

గండీడ్: మండల కేంద్రంలో రాజకీయ పార్టీల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దేవన్న ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఓటర్లకు సంబంధించి సమావేశం ఉంటుందన్నారు. సకాలంలో హాజరుకావాలని సూచించారు.

భూత్పూర్ : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ చారి తెలిపారు.

కరాటేతో ఆత్మరక్షణ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని స్థానిక వీరన్నపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ అన్నారు. పాఠశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కరాటే శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలపాటు జరిగే ఈ కరాటే శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, రాంప్రసాద్, శ్రీనివాస్, వీరాచారి, కరాటే మాస్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని వినతి

దేవరకద్ర: సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బుధవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దేవరకద్రలో జరిగిన కార్యక్రమానికి హాజరు అయిన ఎమ్మెల్యేకు సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, తోటి ఉద్యోగులతో కలిసి ఈ మేరకు సమస్యను విన్నవించారు.

పోరాట యోధులకు నివాళి

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులు అని సీపీఎం సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. బుధవారం మాచన్‌పల్లిలో పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ సభ నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కడియాల మోహన్, నాయకులు హన్మంతు, ఖాదర్, శివలీల, బాలకిష్టయ్యగౌడ్, రమేష్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

భూత్పూర్: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం చిన్నారులకు వైద్యాధికారి అబ్దుల్ రబ్ ఆధ్వర్యంలో.. వివిధ వైద్యపరీక్షలు నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీలో చదువుకుంటున్న చిన్న పిల్లలకు ప్రత్యేకంగా వైరల్ జర్వాలు ప్రబలుతున్న క్రమంలో పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ వసీం సుల్తానా, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు ఉన్నారు.

పాలసీలతో ప్రయోజనం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన ఎండి.కలీమొద్దీన్ ఇటీవలే గుండెపోటుతో చనిపోయారు. రెండేళ్ల కిందట అతను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ.50వేల ప్రీమియంతో 'స్మార్ట్ స్కాలర్ పాలసీ' తీసుకోవడంతో బాధిత కుటుంబసభ్యులకు బుధవారం రూ.5లక్షల బీమా డబ్బులు వారి ఖాతాలో జమ చేశారు. టెరిటరీ మేనేజర్ ఖలీల్ మాట్లాడుతూ ఈ పాలసీ 20 ఏళ్లపాటు కొనసాగుతుందని, మిగిలిన ప్రీమియంలు కుటుంబసభ్యులు కట్టనవసరం లేదని, తదనంతరం మెచ్యూరిటీ కూడా అందజేస్తారని పేర్కొన్నారు. పాలసీలతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

కంది, వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మహమ్మదాబాద్: కంది, వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్ పేర్కొన్నారు. బుధవారం మహమ్మదాబాద్ మండల పరిధిలోని మొకర్లాబాద్‌లో వరి, కంది పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. అధిక దిగుబడులు సాధించడానికిగానూ సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అధిక మోతాదులో రసాయనిక మందులు పిచికారీ చేయరాదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేందర్, విస్తరణాధికారి ఫక్రుద్దీన్, అంజిలయ్య, నర్సింలు, మన్యం, అక్బరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: గ్రామీణ ప్రాంతాలలో క్రీడానైపుణ్యం గల యువతను, బాల బాలికలను వెలికి తీయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక నిర్ణయం తీసుకున్నారని.. ఈ మేరకు గ్రామస్థాయి నుంచి సీఎం కప్ పేరుతో క్రీడలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడలను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తగిన ప్రోత్సాహం లేక గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు తగిన గుర్తింపు రావడం లేదని దీనిని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ఆధ్వర్యంలో సీఎం కప్ పేరుతో గ్రామ స్థాయి క్రీడలకు త్వరలో శ్రీకారం చుడుతుందన్నారు. గ్రామ స్థాయిలో గెలిచిన వారిని మండల స్థాయిలో అక్కడి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. అక్కడి నుంచి దేశ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే క్రీడలకు వెళ్లగలుగుతారన్నారు. ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించిందని ప్రస్తుత బడ్జెట్‌లో రూ. 367 కోట్లు క్రీడలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. మండల స్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను, పీఈటీలను పరిచయం చేసుకున్నారు. అనంతరం గ్రౌండ్‌లో కొద్దిసేపు వాలీబాల్ ఆడి అందరిని ఉత్సాహ పరిచారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి బాల్‌రాం, శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, నాయకులు కోనరాజశేఖర్, బాలస్వామి, గోవర్ధన్‌రెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం దమగ్నాపురంలో గ్రామానికి చెందిన వినోద్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందించారు. ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీడీ ఫార్మా కోజెంట్ కంపెనీ వారు ఏర్పాటు చేసిన మంచినీటి మోటార్ పంపునకు పూజలు చేసి ప్రారంభించారు. లాల్‌కోటలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్జీఎఫ్ పోటీలు

జడ్చర్ల టౌన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మండల టోర్నీ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ రాం కల్యాణ్ తెలియజేశారు. టోర్నీతో పాటు సెలక్షన్స్ ఉంటాయని వివరించారు. అర్బన్ పరిధిలోని పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరవుతారని వెల్లడించారు.

మహబూబ్‌నగర్ క్రీడలు: రూరల్ మండల పరిధిలోని ధర్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈనెల 20, 21 తేదీల్లో మండలస్థాయి అండర్-14, అండర్-17 విభాగం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు.. హెచ్‌ఎం పి.కృష్ణయ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10 పాఠశాలల నుంచి 450 మంది బాల, బాలికలు పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం 9640127727 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జడ్చర్ల: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర ఆదేశించారు. బుధవారం బాలానగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు జెడ్పీహెచ్‌ఎస్, తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ ఎలా ఉందంటూ అక్కడి డాక్టర్ సుష్మితను ప్రశ్నించారు. అనంతరం జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. తెలుగు బోధన చేస్తున్న సమయంలో రామాయణంకు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మరింత నాణ్యతగా అందించాలని హెచ్ఎం సుల్తానాను ఆదేశించారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధరణి పెండింగ్ సమస్యలపై అధికారులతో మాట్లాడారు. పరిష్కరించే విధంగా కృషి చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్



పగిలిన పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో 167వ నెంబరు జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా సిగ్నల్‌గడ్డ రాంరెడ్డి కాంప్లెక్స్ ఎదురుగా నిర్మిస్తున్న ఆర్‌యూబీ వల్ల మిషన్‌భగీరథ పైప్‌లైన్ కొద్దిరోజుల కింద పగిలింది. రోజులు గడుస్తున్నా కాంట్రాక్టర్ పట్టించుకోకపోవటంతో 3వ వార్డులో నీటి సమస్య ఏర్పడింది. కౌన్సిలర్ పలుమార్లు కాంట్రాక్టర్, ఎస్‌హెచ్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. కాలయాపన చేస్తుండటంతో కౌన్సిలర్ సతీష్ మున్సిపల్ కమిషనర్‌తో కలసి ఫోన్ వాట్సాప్ ద్వారా బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే నివేదిక ఇవ్వాలని కమిషనర్ రాజయ్యను ఆదేశించారు. సమస్య కలెక్టర్ దృష్టికి చేరటంతో పబ్లిక్ హెల్త్ ఏఈ వినోద్, ఎన్‌హెచ్ ఏఈ రవి, మున్సిపల్ కమిషనర్‌లు పైప్‌లైన్ పగిలిన ప్రాంతాన్ని సందర్శించారు. కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పైప్‌లైన్ వేయాలని సూచించారు. గురువారం ఉదయం లోగా సమస్య పరిష్కారం కావాలని కలెక్టర్ ఆదేశించినట్లు కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

సభ్యత్వ నమోదు

అడ్డాకుల: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి కరుణాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మూసాపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఆయన తపస్ సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. బాబునాయుడు, రవినాయక్, లక్ష్మీనారాయణ, గంగవీరన్న, ఉపాధ్యాయులు రాఘవేందర్, నర్సింహ్మారెడ్డి, ఆనంద్, గీత, సుగుణ, శశికళ, రాజు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవా



నవాబుపేట: ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం బుధవారం మండలంలో కొనసాగింది. ఎంపీడీఓ జయరాంనాయక్ గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించి ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులతో మానవహారం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి వ్యక్తి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈఓపీఆర్‌డీ బద్రునాయక్, ఏపీఓ జ్యోతి తదితరులు ఉన్నారు.

ఓపెన్ టెండర్ విధానం రద్దు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భవన నిర్మాణ కార్మిక స్కీంలపై ప్రవేశ పెట్టిన ఓపెన్ టెండర్ విధానం రద్దు చేయాలని ప్రగతి శీలభవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అన్నారు. బుధవారం జమిస్తాపూర్‌లో గ్రామ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజు, ఆంజనేయులు, రాజు, నిజాంపాషా, దాసు, ఖాదర్ పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన

మిడ్జిల్: రైతులు వేరుశెనగ సాగుకు సిద్ధం అవుతున్న క్రమంలో విత్తన శుద్ధిపై బుధవారం కొత్తూర్‌లో పాలెం వ్యవసాయ విద్యార్థులు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి ఎంతో ముఖ్యమని సూచించారు. తెగులు నివారించడంతో పాటు, పంట దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. వైష్ణవి, సౌమ్య, ప్రసన్న పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద ఉండి కోలుకుంటున్నాడు. బాధితుడిని బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. లక్ష్మీనర్సింహ యాదవ్, కొండయ్య, అనిల్‌రెడ్డి ఉన్నారు.

మేదరుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చాం



వస్తువులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్‌ఎస్ హయాంలో మేదరుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవ కార్యక్రమంలో బుధవారం స్థానిక అమరవీరుల స్థూపం సమీపంలో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. 523 సర్వే నంబర్‌లో పేదల పక్షాన పోరాటం చేసినందుకు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నర్సిములు, వెంకన్న, ఆంజనేయులు, కౌన్సిలర్ గణేష్, రామ్‌లక్ష్మణ్, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, కిషన్ పవార్ పాల్గొన్నారు.

కేతేశ్వరస్వామి విగ్రహం ఏర్పాటు చేస్తాం



కేతేశ్వరస్వామి చిత్రపటానికి పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరులో కేతేశ్వర స్వామివారి విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో కేతేశ్వర స్వామివారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేదర సంఘం అభివృద్ధికి పాటుపడతామన్నారు. అనంతరం డీసీసీ కార్యాలయం ఆవరణలో తాగునీటి కోసం పవర్ బోరు తవ్వకం పనులను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌యాదవ్, మల్లు నర్సింహారెడ్డి, బేకరి రఘు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ కార్యవర్గాల ఎన్నిక

జడ్చర్ల టౌన్: పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఉదయ్‌కుమార్, పర్యవేక్షకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా రాజీవ్‌రెడ్డి, మోహన్‌రాజ్, ఉపాధ్యక్షులుగా భూప్యానాయక్, మహిళా అధ్యక్షురాలిగా స్నేహలత, మహిళా కార్యదర్శిగా అతియా సుల్తాన, కార్యదర్శులుగా యాదయ్య, శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

మహమ్మదాబాద్: పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా భీమ్‌రెడ్డి, కార్యదర్శిగా పుట్టి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా నర్సిములు, మహిళ ఉపాధ్యక్షురాలిగా మంజుల, మహిళ కార్యదర్శిగా వనజలత, ఉపాధ్యక్షులుగా రేణుక, కార్యదర్శులుగా రమేష్, ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య ఎన్నికయ్యారు.

భూత్పూర్: పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా సత్తూర్ బాల్‌రాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పి.కృష్ణయ్యలను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడి సాయిరాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా దస్తయ్య, మహిళా కార్యదర్శిగా జ్యోతి, కార్యదర్శిగా రాంప్రభు, మహిళా ఉపాధ్యక్షులుగా లక్ష్మి ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు న్యూరిషి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక రాజేంద్రనగర్‌లోని న్యూరిషి ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.రాహుల్‌నాయక్ (పదోతరగతి) పి.రామ్‌చరణ్ (తొమ్మిదో తరగతి) ఎంపికయ్యారు. ఇటీవలే జిల్లాస్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థులను పాఠశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్లు పూజిత మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్, సాయి సుకాంత్ కృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటరమణ, పీఈటీ విష్ణుకాంత్‌గౌడ్ అభినందించారు.



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

భారీ గణనాథుడికి వీడ్కోలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక బండ్లగేరిలో ప్రతిష్ఠించిన 28 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని బుధవారం అర్ధరాత్రి ఘనంగా పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్) లో నిమజ్జనం చేశారు. అంతకుముందు 'మై ఇండియా యూత్ అసోసియేషన్' ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన వీధుల గుండా వైభవంగా ఊరేగింపు, శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొని ఈ భారీ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

వైద్యశిబిరం కరపత్రాల విడుదల

నారాయణపేట రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ యశోద కేర్ ఆస్పత్రిలో ఈనెల 20న నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా లయన్ సభ్యులు మాట్లాడుతూ.. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళ, యువతుల ఆరోగ్య సమస్యలపై నిర్వహించే ఉచిత శిబిరాన్ని మహిళలు యువతులు సద్వినియోగం చేసువాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఎండోమెట్రోసిస్ సంబంధిత వ్యాధులకు ఉచిత చికిత్సతోపాటు ల్యాబ్ పరీక్షలు స్కానింగ్ చేసి ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హరిణారాయణ్, ప్రీతి, జనార్ధన్ రవి గౌడ్, బాలాజీ కన్న జగదీష్, కృష్ణ మూర్తి, సిబ్బంది సురేష్, వెంకటేష్, విమల పాల్గొన్నారు.

'సాక్షి సంతకం కోసం పిలిచి భూమి పట్టా చేసుకున్నారు'

నవాబుపేట: సాక్షి సంతకం కావాలని పిలిచి ఏకంగా తన ఎకరా భూమిని తన సోదరుడు పట్టా చేసుకున్నాడని.. తనకు న్యాయం చేయాలని ఓ వ్యక్తి బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. కిషన్‌గూడకి చెందిన అంజయ్య తన కుమారుడు రాములుకు భూమిని పట్టా చేస్తున్నానని సాక్షిగా సంతకం చేయాలంటూ తమ్ముడు కేశవులును కోరాడు. దీంతో అతడు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సంతకాలు చేశాడు. ఈ క్రమంలో అంజయ్య.. కేశవులు భూమిని తన కుమారుడు రాములు పేర చేయించుకుని వెళ్లిపోయాడు. కాగా తాను చేసింది సాక్షి సంతకం కాదని.. తన భూమిని రిజిస్ట్రేషన్ చేశానని కేశవులు ఆలస్యంగా తెలుసుకున్నాడు. ఈ మేరకు ఆందోళన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని గ్రామస్తులతో కలిసి మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు.

వివాహిత అదృశ్యం

హన్వాడ: మండల పరిధిలోని కొత్తపేటకి చెందిన వివాహిత అంజలి అదృశ్యమైంది. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. అంజలి ఈనెల 16న ఇంట్లోంచి ఎక్కడికో వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త కృష్ణయ్య తన బంధువులతో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పోలీసులకు ఫిర్యాదు

రాజాపూర్: తిరుమలగిరి శివారులో భూమిని తమకు విక్రయిస్తామని చెప్పి.. మోసంతో డబ్బులు తీసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని హైదరాబాద్‌కు చెందిన వసుంధర బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలానికి చెందిన జగన్‌నాయక్ నాలుగేళ్ల క్రితం భూమి విక్రయిస్తానని రూ. ఎనిమిది లక్షల పది వేలు అడ్వాన్స్ తీసుకుని.. తీరా రిజిస్ట్రేషన్ సమయానికి ఇబ్బందులు పెట్టడం ప్రారంభించాడని వాపోయారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రవి తెలిపారు.

అంత్యక్రియలకు సాయం

గండీడ్: వెన్నాచేడ్‌కి చెందిన అర్జున్(38) హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడు. మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మరణించారు. అతడి అంత్యక్రియలకు స్నేహితులంతా రూ. 23,000 సాయం అందజేశారు. గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలోనూ రూ.9,000 బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ సర్పంచ్ గోపాల్, నాయకులు పులిందర్‌రెడ్డి, గుర్రాల చెన్నయ్య, గువ్వలి వెంకటయ్య, రవీందర్, వెంకటయ్య తదితరులు అర్జున్‌కు నివాళి అర్పించారు.

నివాళి..

దేవరకద్ర: కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా బుధవారం బస్వాయపల్లి గ్రామంలో జరిగిన దశదినకర్మకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంజిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కోనరాజశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, హన్మంతరెడ్డి ఉన్నారు.

పోమాల్ చెరువు లీకేజీ పూడ్చివేత



పనులు చేయిస్తున్న అధికారులు

నవాబుపేట: మండల పరిధిలోని పోమాల్ గ్రామంలో ఉన్న చిన్నచెరువు నిండి అలుగు పారుతున్న తరుణంలో.. చెరువు అలుగు లీకేజీతో నీరు వృథాగా పోతోంది. దీంతో గ్రామస్తులు బుధవారం సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు స్పందించి చెరువు లీకేజీని పూడ్చి వేశారు. కాగా ఇటీవల కూచూర్ చిన్న చెరువుకు సైతం లీకేజీ కావటంతో అధికారులు మరమ్మతు చేపట్టిన విషయం తెలిసిందే.

కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తరలిరండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వెల్ఫేర్ బోర్డును ప్రైవేట్ బీమా సంస్థలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు.. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనెల రాములు, వరద గాలన్న, కోశాధికారి తిరుమలయ్య బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రిషన్లు, ప్లంబర్లు, పెయింటర్లు, టైల్స్ అండ్ గ్రానైట్ వర్కర్స్, కూలీలు తదితరులు అంతా ధర్నాకు తరలిరావాలని కోరారు.

భూ ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

జడ్చర్ల: వాడ్యాలకి చెందిన వృద్ధురాలు బిస్మిల్లాబీకి చెందిన భూమిని ఇతరులు మోసం చేసి ఆక్రమించారన్న ఫిర్యాదుపై విచారించి చర్యలు చేపట్టాల్సిందిగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మిడ్జిల్ తహసీల్దార్‌ను ఆదేశించినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 92(అ)లో 11.28 ఎకరాల భూమి ఉండగా ఆమె ముగ్గురు కుమార్తెలతో కలిసి హైదరాబాద్‌లో జీవిస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే కొంతమంది ఆమె మరణించిందంటూ అధికారులను నమ్మించి కొంత భూమిని పట్టా చేసుకున్నారని తెలిపారు. మరి కొందరు ఆమె ఇంటిని కూడా మాయం చేశారని.. తనకు న్యాయం చేయాలని మీడియా ద్వారా కోరడంతో ఎమ్మెల్యే స్పందించినట్లు తెలిసింది.

లిఫ్ట్‌కు మరమ్మత్తులు చేయండి

జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో లిఫ్ట్‌కు మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కోరారు. కొన్ని రోజులుగా లిఫ్ట్ పని చేయక పోవడంతో సిబ్బందితో పాటు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

పీయూకు పుస్తకాల వితరణ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీకి న్యూ ఏజ్ పబ్లికేషన్స్ నిర్వాహకులు సుమారు రూ.50 వేల విలువ జేసే వివిధ విభాగాల రిఫరెన్స్ బుక్స్‌ను వితరణ చేశారు. కాగా బుధవారం పీయూలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనలో వీటిని రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి డా.రాజ్‌కుమార్ పరిశీలించారు. అదనంగా పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను సైతం పంపించాలని వారిని కోరారు. అధ్యాపకులు పాల్గొన్నారు.